సాక్షి సంగారెడ్డి

7

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



ఉధృతంగా ప్రవహిస్తున్న అన్నాసాగర్ చెరువు

న్యూస్‌రీల్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు: అదనపు కలెక్టర్



సంగారెడ్డి జోన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతీ శుక్రవారం అన్ని గ్రామాలలో పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా, ప్రతీ నాలుగు రోజులకొకసారి బ్లీచింగ్ కలపాలని సూచించారు. దోమల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖతోపాటు పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు.

పంట నష్టం వివరాలు సేకరణ



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

న్యాల్‌కల్ (జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వర్షాలకు 69 ఎకరాల్లో పెసర, మినుము, సోయా పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారులు వెల్లడించారు. రేజింతల్, మామిడ్గి, ముంగి, హద్నూర్, హుమ్నాపూర్, మెరియంపూర్ తదితర గ్రామాల్లో ఎంఏఓ అభినాష్ వర్మ, ఏఈఓలు సోమవారం పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించారు.

విద్యా వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తోంది

ధర్నాలో అంగన్‌వాడీ ఉద్యోగులు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఐసీడీఎస్‌తోపాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని అంగన్‌వాడీ ఉద్యోగులు ఆరోపించారు. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగులకు అతి తక్కువ వేతనం చెల్లిస్తూ పని భారం పెంచుతుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కార్యదర్శి మంగ, నాయకులు ఏసుమణి, నాగేశ్వరి, గౌరమ్మ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అదృశ్య ఆయుధం జియోస్పేషియల్ టెక్నాలజీ

ఇస్రో మాజీ శాస్త్రవేత్త పద్మజ



సమావేశంలో విద్యార్థులకు వివరిస్తున్న ఇస్రో మాజీ శాస్త్రవేత్త పద్మజ

పటాన్‌చెరు: ఆధునిక యుద్ధంలో జియోస్పేషియల్ టెక్నాలజీని 'అదృశ్య ఆయుధం'గా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ సీనియర్ శాస్త్రవేత్త, ట్రిబుల్ ఐటీ పీహెచ్‌డీ స్కాలర్ పద్మజ అభివర్ణించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'జియో–స్పేషియల్ ఆపరేషన్స్, రిమోట్ సెన్సింగ్ అనువర్తనాలు' అనే అంశంపై సోమవారం ఆమె అతిథి ఉపన్యాసం చేశారు. అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...జియోస్పేషియల్ సాంకేతికత శత్రు స్థావరాలు, అక్కడి భూభాగ పరిస్థితులు, నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించే ప్రణాళికలను రచించడానికి తోడ్పడుతుందని చెప్పారు. జియో భూమిని సూచిస్తుందని, స్పేషియల్ అనేది భూమిపై ఉన్న వస్తువుల రేఖాగణిత లక్షణాలను సూచిస్తుందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అతలాకుతలం

ఎడతెరిపిలేకుండా కురుస్తోన్న భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చేలల్లోకి వరద చేరి పంట నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. వరద ఉధృతికి పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణాల్లో రోడ్లపైకి నీరు చేరింది.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:

- తెగిపడిన రోడ్లు..నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంటపొలాలు
- పూర్తిగా నిండిన నల్లవాగు ప్రాజెక్టు
- సింగూరుకు 37 వేల క్యూసెక్కుల వరద రాక



అలుగు పారుతున్న నల్లవాగు ప్రాజెక్టు

కంగ్టి మండలంలో కురిసిన భారీ వర్షానికి పలు వాగు పొంగి ప్రవహించాయి. ఏకంగా 16.6 సెం.మీల రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. దీంతో ఈ మండలంలోని రాసోల్, మురుకుంజాల్, తడ్కల్ బాన్సువాడ రోడ్డు రాకపోకలు నిలిచిపోయాయి. వలుమూరు వాగు వంతెన వద్ద ఉన్న రోడ్డు 30 మీటర్ల మేరకు కోతకు గురైంది. విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కల్హేర్ మండలంలోని మహారాజువాగు, మీర్కంపేట్‌వాగు, సిర్గాపూర్ మండలంలోని గైరాన్‌తాండా వాగులు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి హత్నూర మండలం ఎల్లమ్మగూడ – కొడుపాక గ్రామాల రోడ్డు ధ్వంసమైంది. గుమ్మడిదల మండలంలోని అన్నారం వద్ద 765 జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ నీటిని తొలగించేందుకు డివైడర్‌ను పగులగొట్టాల్సి వచ్చింది. అమీన్‌పూర్ మండలం గండిగూడెం వద్ద అవుటర్ రింగ్ రోడ్డుపై వరద నీరు ప్రవహించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఖాజీపల్లి, శంబీపూర్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మునిపల్లి మండలం డబ్బువాగు రోడ్డుపై ప్రవహించడంతో ఝరాసంఘం మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

రికార్డు స్థాయిలో వర్షపాతం

జిల్లాలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. నిజాంపేటలో 13.0 సెం.మీలు, కల్హేర్‌లో 11.9 సెం.మీలు, కడ్పాల్‌లో 10.7 సెం.మీలు, హత్నూరలో 10.1 సెం.మీలు, అన్నాసాగర్‌లో 10.3 సెం.మీలు, గుమ్మడిదలలో 9.4 సెంటీలు, సిర్గాపూర్‌లో 9.7 సెం.మీల రికార్డు వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రోజంతా ముసురు పెట్టింది.



ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టి రాకపోకలు నిలిపివేత



ఉధృతంగా ప్రవహిస్తున్న మహరాజ్‌వాగు



మహరాజ్ వాగును పరిశీలిస్తున్న అధికారులు

సింగూరుకు 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టు వరద పోటెత్తింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ఏకంగా 37 వేల క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్టుకు గండిపడే ప్రమాదం ఉండటంతో 43 వేల క్యూసెక్కులను గేట్ల ద్వారా, జెన్‌కో విద్యుత్ ఉత్పత్తికి నీటిని విడుదల చేస్తున్నారు. మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు పూర్తి స్థాయిలో నిండింది.

పంట పొలాల్లోకి వరద

భారీ వర్షానికి పంట పొలాల్లోని వర్షం నీరు చేరింది. మునిపల్లి, ఝరాసంగం, కోహీర్, రాయికోడ్, సదాశివపేట, కల్హేర్, నారాయణఖేడ్, నిజాంపేట తదితర మండలాల్లో పంటలు నీట మునిగాయి. పత్తి, కంది, పెసర, మినుము, మిరప వంట పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి.

సరిహద్దులు దాటొద్దు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో ఎస్పీ పరితోశ్ పంకజ్ తదితరులు

యూరియాపై సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: పంట సాగులో వినియోగించే యూరియాను జిల్లా సరిహద్దులు దాటకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జిల్లా ఎస్పీ పరితోశ్‌పంకజ్‌తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో అవసరం మేరకు ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సొసైటీలలో ఎరువుల స్టాక్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, నిర్ణీత ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌తో పాటు వచ్చే రబీ సీజన్‌లో కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులతో బాధితులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్యతోపాటు ఇతర అధికారులు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

నేనేమైనా దొంగనా?

మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి అనే రైతు నేనేమైనా దొంగనా? నా సమస్య చెప్పుకోవద్దా? అంటూ ప్రజావాణిలో అధికారుల ముందు విలపించాడు. గ్రామంలోని 307/అ సర్వే నంబర్ లో ఉన్న ఒక ఎకరా 31 గుంటలు అనువంశికంగా వస్తోంది. కొన్నేళ్ల క్రితం ధరణి రావటంతో అసైన్‌మెంట్ భూమిగా చూపిస్తోంది. మూడేళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరిగినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఘనంగా టీఎల్‌ఎం మేళా



టీఎల్‌ఎం మేళాలో బోధనోపకరణాల ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

సదాశివపేట(సంగారెడ్డి): ఉపాధ్యాయుల బోధనోపకరణాల మేళాను సోమవారం పట్టణంలోని రవీంద్రమోడల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల సముదాయంలో నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధించే తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులను వివరించడానికి ఉపాధ్యాయులు ఉపయోగించే వివిధ రకాల బోధనోపకరణాలను మేళాలో ప్రదర్శించారు. పట్టణ, మండల పరిధిలోని 55 పాఠశాలల ఉపాధ్యాయులు వివిధ రకాల బోధనోపకరణాలు తయారుచేసి ప్రదర్శించగా అందులో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన 10 పాఠశాలలు జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈఓ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్‌ఎన్‌ఓ సుధాకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు జయసుధ, వినయ్‌కుమార్, రాజశ్రీ, నిజాముద్దీన్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సీఆర్పీలు పాల్గొన్నారు.

డ్యామ్‌కు శాశ్వత మరమ్మతులు

సమీక్షలో మంత్రి దామోదర



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర, చిత్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్

సంగారెడ్డి జోన్: సింగూర్ డ్యామ్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...డ్యామ్‌పై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. డ్యామ్ పరిరక్షణకు దేశంలో అత్యున్నత స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అవసరమైన డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువల లైనింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెద్ద రెడ్డిపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సర్వే పనులు తదితగతిన పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందించాలన్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాధులు విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ చేసిన దామోదర

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమైని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఐబి నుంచి కలెక్టరేట్ వరకు గౌడ్ కులస్తుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్‌పంకజ్, అదనపు కలెక్టర్, చంద్రశేఖర్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు నక్క నాగరాజుగౌడ్, వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో మంత్రి దామోదర. చిత్రంలో నిర్మలారెడ్డి తదితరులు

పంట నష్టంపై ప్రతిపాదనలివ్వండి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే నిర్వహించి నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో ఆయన సమావేశమై వివరాలను సేకరించారు. పెసర, మినుము మరో ఇరవై రోజుల్లో చేతికి వచ్చే పరిస్థితి ఉందని, ఈ సమయంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిందని అన్నారు. కంది, పత్తిపంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. వర్షాలు, వరదల కారణంగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు అక్కడక్కడా దెబ్బతిన్నాయని అధికారులు దృష్టికి తీసుకురాగా వాటి మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే సూచించారు. లోలెవల్ కాజ్‌వేలు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో వివరాలు వెంటనే సేకరించి మరమ్మతులకు ప్రతిపాదించాలని అధికారులు ఆదేశించారు. జనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు.

నల్లవాగు నీటిని వదలండి

నల్లవాగు నీటిని వెంటనే విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించారు. నల్లవాగు ప్రాజెక్టు నిండి అలుగుపై నుంచి వరద నీరు పొంగి పొర్లుతోందని, కుడి, ఎడమ కాలువలద్వారా నీటిని వదలాలని సూచించారు. రైతులు ఆయా చెరువుల్లో వరద నీటిని నింపుకోవాలని సూచించారు. చివరి ఆయకట్టుకు కూడా నీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని వివరించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): వినాయక చవితి వేడుకలకు మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు పోలీస్‌శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ స్పష్టం చేశారు. పట్టణంలోని ఎస్‌గార్డెన్‌లో సీఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశానికి డీఎస్పీ హాజరై మాట్లాడారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు నిర్వాహకులు పూర్తిగా నిబంధనల మేరకు నడుచుకుంటూ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశంలో మైక్‌సెట్లు ఏర్పాటు చేయాలంటే పోలీసు, విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పసరిగా తీసుకోవాలన్నారు. వినాయక మండపాలు, నిమజ్జన ఊరేగింపులో డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మునిపల్లి సత్యనారాయణ, సిద్ధన్న, అశిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గురుకులానికి గజ్జి

చర్మ వ్యాధులతో విద్యార్థుల అవస్థలు

- ఇళ్లకు వెళ్లిపోయిన 50మంది పిల్లలు
- ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో నరకయాతన



గజ్జి, తామర సోకడంతో చేతులు, ఒంటిపై దద్దుర్లు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో చాలామంది విద్యార్థులు చర్మ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల నుంచి హాస్టల్‌లో విద్యార్థులు గజ్జి, తామర వంటి చర్మవ్యాధులతో ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నా ప్రిన్సిపాల్ పట్టించుకున్న పాపాన పోలేదు. విద్యార్థుల ఒంటిపై విపరీతమైన దద్దుర్లు వచ్చి దురదలు పెడుతున్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియక నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు హాస్టల్‌లో ఉండలేక ఇంటికి వెళ్లిపోయారు.

ఆస్పత్రులకు తిప్పుతున్న తల్లిదండ్రులు

గురుకులంలో సుమారు 50మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. తమ పిల్లలకు చర్మవ్యాధులు నయం కాకపోవడంతో బీదర్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లోని ఆస్పత్రుల చుట్టూ తిప్పుతున్నారు. చర్మవ్యాధి నిపుణులు పరీక్షించి రూ.వేల మందులు సూచిస్తున్నారు. విద్యార్థులకు కాస్త నయం కాగానే గురుకులానికి పంపించగానే తిరిగి చర్మవ్యాధులు అంటుకుంటున్నాయి. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలో తెలియక అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. తమ పిల్లలను చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రులు, బంధువులను ప్రిన్సిపాల్ కలవనివ్వకపోవడం, విద్యార్థులను గద్దించి పంపించి వేస్తుండటంతోనే చర్మవ్యాధులు మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. పిల్లలను కలిసేందుకు వెళ్లినపుడు విషయం బయటపడుతుందని కలవనివ్వడంలేదని వారు చెబుతున్నారు.

చెత్తా చెదారంతో దుర్గంధం

గురుకులంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. నీటి ట్యాంకులను సరిగ్గా క్లీన్ చేయించడం లేదని, నీటిలో బ్లీచింగ్ చల్లకపోవడంతో చర్మవ్యాధులు మరింత తీవ్రమైనట్లు విద్యార్థులు వాపోతున్నారు. గురుకులంలో ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారం నిండి దుర్గంధం వెదజల్లుతోంది.

240 మందికి ఒకే మరుగుదొడ్డి

గురుకులంలో రెండు భవనాలున్నాయి. ఒక భవనంలో 5, 6, 7వ తరగతి విద్యార్థులు చదువుతూ నివాసం ఉంటున్నారు. మూడు తరగతులకు కలిపి 240మంది విద్యార్థులకుగాను 5 మరుగుదొడ్లు ఉండగా నాలుగు చెడిపోయాయి. వాటికి మరమ్మతు చేయించకపోవడంతో ఉన్న ఒక్క మరుగుదొడ్డినే ఈ 240 మంది విద్యార్థులు ఉపయోగించాల్సి పరిస్థితి నెలకొంది. మరో భవనంలో 8, 9, 10వ తరగతులకు కలిపి 240 మందికిగాను 3 మరుగుదొడ్లు ఉండగా ఒకటి ఉపాధ్యాయులు వాడుకొంటుండగా రెండింటినే 240మంది విద్యార్థులు ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలకు ఉపక్రమించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. లేదంటే విద్యార్థి సంఘాలతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

గురుకులంలో తనిఖీలు

విద్యార్థుల అస్వస్థతపై విచారణ చేపట్టిన అధికారులు



విచారణ చేస్తున్న అధికారులు

పుల్‌కల్(అందోల్): సింగూరు గురుకుల పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతపై రాష్ట్ర గురుకుల సొసైటీ జాయింట్ సెక్రటరి సక్రునాయక్, జోనల్ అధికారి రజిని సందర్శించి విచారణ చేపట్టారు. విద్యార్థులు అస్వస్థతపై 'సాక్షి'దిన పత్రికలో వచ్చిన కథనంపై స్పందించి అధికారులు గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థుల టాయిలెట్లు, వంటగదులను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై వివరాలు సేకరించారు. కాగా అధికారుల విచారణలో హౌస్ మాస్టర్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో చర్యలకు ఉపక్రమించారు. పేద విద్యార్థుల చదువుకునే సంస్థలో సిబ్బంది ఇంత నిర్లక్ష్యమా అని ప్రిన్సిపాల్ అడివయ్యపై మండిపడ్డారు. విద్యార్థులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని నిలదీశారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.



వాటెన్ ఐడియా..



సాయం సంధ్యలో ఒదిగేలా



సొంత గూడు నిర్మాణంలో...



మకరందాన్ని పీలుస్తున్న కీటకం



మంజీరా డ్యామ్ ఆవరణలో సీతాకోక చిలుక



ఎదగాలన్న తపన ఉంటే ఎక్కడైనా..

చిత్రం అబ్బురం.. జ్ఞాపకం పదిలం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

రెప్పపాటులో జరిగిపోయే దృశ్యాలను ఒక్క క్షణంలో ఆవిష్కృతం చేసేది ఒక్క కెమెరానే. కెమెరాలో బందీ అయిన ప్రతి చిత్రం అబ్బుర పరుస్తుంది. చిరకాలం పదిలంగా మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. జ్ఞాపకాలకు శాశ్వతంగా ప్రాణం పోసేది ఫొటో. శ్రామిక జీవుల సౌందర్యం, ప్రకృతి మనోహర దృశ్యాలు, పశుపక్షాదులు, పూలసోయగాలు.. ఇలా పదిలంగా ఉంచేదే చిత్రం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సాక్షి క్లిక్ మనిపించిన చిత్రాలు.

– సిద్దిపేట / సంగారెడ్డి సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు / మిరుదొడ్డి(దుబ్బాక)



సంధ్య వేళ..పక్షుల సందడి



పచ్చని పొలాల సోయగం



కాకి 'బలగం'



గూడు వద్ద రామచిలుక..

క్లుప్తంగా

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వివిధ శాఖల అధికారులతో కలిసి పోలీసు సిబ్బంది సమష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పోలీసులు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712 667 100కు ఫోన్ చేయాలని సూచించారు.

సీసీ కెమెరాలో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామీణ యువత కోసం సీసీ కెమెరాల సర్వీసింగ్‌లో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్రం డైరెక్టర్ రాజేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులని, వివరాలకు 94901 03390, 94901 29839 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇళ్లు కూలి.. ముగ్గురికి గాయాలు



పత్తికుంట తండాలో కూలిన ఇల్లు

పుల్‌కల్(అందోల్): భారీ వర్షాలకు మండలంలోని పాత ఇళ్లు కూలుతున్నాయి. పత్తికుంట తండా, పోచారం గ్రామంలో సోమవారం ఇళ్లు కూలడంతో ముగ్గురు గాయపడ్డారు. పత్తికుంట తండాలో తేజావత్ జితేందర్ ఇళ్లు కూలి మట్టి పెళ్లలు మీద పడటంతో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు సునీత, కార్తీక్‌కు గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఎస్ఐ విశ్వజన్ , ఎంపీఓ వేంకటేశ్వర్ రెడ్డి పరామర్శించారు. బాధితులకు కొత్త ఇంటిని మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నకిలీ నోట్ల కలకలం

- ఒకే నంబర్‌తో మూడు 500 నోట్లు



ఒకే నంబర్‌తో ఉన్న మూడు రూ.500 నోట్లు

చేర్యాల(సిద్దిపేట): మండలంలో నకిలీ నోట్లు కలకలం రేపాయి. వివరాల్లోకి వెళితే... ముస్త్యాల గ్రామంలో ఓ షాపు యజమానికి అదే గ్రామానికి చెందిన వ్యక్తి గడిచిన వారం రోజుల్లో మూడు నకిలీ నోట్లు ఇచ్చాడు. అతడు ఇచ్చిన మూడు రూ.500 నోట్లు అన్నీ ఒకే నంబర్ కలిగి ఉన్నాయి. కాగా వారం రోజుల క్రితం ఒక నోటు ఇచ్చి వస్తువులు కొనుగోలు చేసిన సదరు వ్యక్తి 15వ తేదీన మరొక నోటు, ఆదివారం మరో నోటు ఇచ్చినట్లు సమాచారం. నోటు ఇచ్చిన సమయంలో అనుమానం వచ్చిన షాపు యజమాని సదరు వ్యక్తిని ప్రశ్నించగా నాకు మా బంధువులు ఇచ్చారని సమాధానం చెప్పినట్లు తెలిసింది. షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

కల్తీ కల్లు విక్రయిస్తే చర్యలు

పాపన్నపేట(మెదక్): జిల్లాలో కల్తీకల్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీటీఎఫ్ సీఐ గోపాల్ హెచ్చరించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని గాజులగూడెం, కొత్తపల్లి, అన్నారం, అబ్లా పూర్, యూసూఫ్‌పేట, కొడపాక, పొడ్చన్‌పల్లి, కుర్తివాడ, నార్సింగి గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కల్తీ కల్లు విక్రయించడం నేరమని, దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు కల్లు దుకాణాల్లో సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం మెదక్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించనున్నట్లు తెలిపారు. ఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హుస్నాబాద్‌రూరల్: రోరోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా... స్థానికుల కథనం ప్రకారం... అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన అఖిల్ (25) హుస్నాబాద్ నుంచి బైక్‌పై గ్రామానికి వెళుతున్నాడు. పోతారం(ఎస్) క్రాసింగ్ దగ్గర వర్షానికి బైక్ అదుపు తప్పిరోడ్డు పక్కన ఉన్న కందకంలో పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వాహనదారులు చూసి 108కి సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

అరటి సాగు.. బాగు



జహీరాబాద్ ప్రాంతంలో పండిస్తున్న అరటి తోట

ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- పెరుగుతున్న విస్తీర్ణం
- జిల్లాలో సుమారు 2వేల ఎకరాల్లో సాగు

జహీరాబాద్ టౌన్: అరటికి ఏ సీజన్‌లోనైనా మంచి డిమాండ్ ఉంటుంది. ఏడాది పొడవునా సాగుకు అనుకూలంగా వాణిజ్యపరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకోవడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అరటి పంటతో పాటు పిలకలు, ఆకులకు గిరాకీ ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులతో అధిక లాభాలు సాధించవచ్చు. జిల్లాలో జహీరాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో అరటి పంటను సాగు చేస్తున్నారు.

జిల్లాలో ఏడాది పొడవునా అరటికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఎర్రటి, నల్లరేగడి నేలలు సాగుకు అనుకూలం. జహీరాబాద్ డివిజన్‌లో వ్యవసాయ బావులు ఎక్కువగా ఉండటంతో నీటి తడులకు ఢోకాలేదు. జిల్లాలో జహీరాబాద్, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్, గుమ్మడిదల, కొండాపూర్ తదితర మండలాల్లో అరటి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. జహీరాబాద్ డివిజన్‌లో సాగు విస్తీర్ణం ఎప్పుడు తగ్గడం లేదు. ఒక్క జహీరాబాద్ డివిజన్‌లోనే ప్రతి సంవత్సరం సుమారు 500 పైగా ఎకరాల్లో పంట సాగవుతుంది. జిల్లా మొత్తం కలిపి సుమారు 2వేల ఎకరాల్లో అరటి పంటను రైతులు పండిస్తున్నారు. గతంలో మనూర్ మండలంలో పెద్ద ఎత్తున పండించే వారు. మంచి దిగుబడి వచ్చినా కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పంట సాగు పట్ల రైతులకు ఆసక్తి తగ్గింది. ఇప్పుడు అరటికి డిమాండ్ పెరగడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించడం వల్ల సాగుకు అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ రాయితీ

పండ్ల తోటల సాగును ప్రోత్సహించడంతో భాగంగా ప్రభుత్వం అరటి సాగు విస్తీర్ణం పెంచేందుకు రాయితీ అందిస్తుంది. అరటిని టిష్యూ కల్చర్, పిలకలు, గడ్డల పద్ధతిలో సాగు చేస్తారు. టిష్యూ కల్చర్, పిలకల పద్ధతికి ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ ఇస్తుంది. ఎకరాకు సుమారు రూ.35 వేల వరకు ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు రాయితీ అందిస్తుంది. డ్రిప్ పరికరాలకు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

రెండేళ్ల నుంచి మంచి ఆదాయం



50 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్న. దిగుబడి బాగానే వస్తుంది. మూడేళ్ల క్రితం నష్టాలు చవిచూశాం. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ సంవత్సరం మధ్యప్రదేశ్ నుంచి వ్యాపారులు వచ్చి సరైన ధరకు కొంటున్నారు. మూడేళ్ల క్రితం రూ.4 కిలో అమ్ముడు పోగా ఇప్పుడు రూ.20 కిలో చొప్పున కొంటున్నారు.

– నల్ల నాగేశ్వర్ రెడ్డి, రైతు, రంజోల్

మంచి డిమాండ్ ఉంది



అరటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జహీరాబాద్ డివిజన్ పరిధిలో అనుకూల వాతావరణం ఉన్నందున మంచి దిగుబడులు వస్తాయి. ఈ ప్రాంతంలో అరటి విస్తీర్ణం ఎప్పుడు తగ్గడం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తున్నందున సాగు విస్తీర్ణం పెరుగుతుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే అరటి సాగులో అధిక లాభాలు సాధించవచ్చు. పంట సాగు విషయంలో అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. విత్తన శుద్ధి చేపట్టి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

– పందరి, ఉద్యానశాఖ అధికారి, జహీరాబాద్

పెళ్లింట విషాదం

- తండ్రీకొడుకు మృతి
- చంద్లాపూర్, గంగాపూర్ గ్రామాల్లో విషాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆ తండ్రీకొడుకుల అనుబంధంపై విధికి కన్నుకుట్టింది. వారిని శాశ్వతంగా విడదీసింది. పెళ్లి వేడుకల ఆనందం ముగియకముందే ఆ కుటుంబంలో శోకం మిగిల్చింది. వారి మరణం రెండు గ్రామాల్లో విషాదం మిగిల్చింది. మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన మూర్తి గజేందర్ రెడ్డి(50)కి భార్య పద్మ, కుమారుడు రాజిరెడ్డి(27), కూతురు సంతోషి ఉన్నారు. వీరికి గంగాపూర్ శివారులో ఎకరం సాగు భూమి ఉంది. ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 14న కూతురు సంతోషి పెళ్లి ఘనంగా జరిపించారు. పెళ్లి పనులు పూర్తి కావడంతో సోమవారం తండ్రి, కొడుకు అడవి పందుల బెడద నుంచి మొక్కజొన్న పంటను రక్షించేందుకు వైరు చుడుతున్నారు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. పెళ్లింట విషాదం నెలకొనడంతో ఇటు చంద్లాపూర్, సాగు చేస్తున్న గంగాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది. ఘటనా స్థలానికి చేరుకున్న రెండు గ్రామాల ప్రజలు, బంధువులు తండ్రి, కొడుకు మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

చేపల వేటకు వెళ్లి.. అదృశ్యం



దుర్గేశ్

కొల్చారం(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఏషబోయన దుర్గేశ్ ఆదివారం ఉదయం గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలోని మంజీరా నదికి చేపల కోసం వెళ్లాడు. సోమవారం సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సోదరుడు నర్సింహులు పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



విట్టల్

ఝరాసంగం(జహీరాబాద్): గ్యాస్ లీకైన ఘటనలో మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా... మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలో ఈనెల 6న గ్యాస్ లీకై మంటలంటుకొని ఒకే కుటుంబంలోని తల్లి శంకరమ్మతో పాటు కుమారులు ప్రభు కుమార్, విట్టల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈనెల 6న తల్లి, 15న ప్రభు కుమార్ మృతి చెందారు. సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్న కుమారుడు విట్టల్(32) మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. భార్యతో పాటు కుమారులకు అంత్యక్రియలు నిర్వహించిన తండ్రి బక్కన్న గుండెలవిసేలా ఏడ్చారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు

తల్లి మృతి, కుమారుడికి స్వల్ప గాయాలు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా, నిజాంపేట మండలం.. బాచుపల్లి గ్రామానికి చెందిన పరమేశ్, తల్లి సంతోష (48) ఇద్దరు కలిసి బైక్‌పై ఆదివారం కూలీ పనికి ఇస్నాపూర్‌కు వచ్చారు. పని దొరకకపోవడంతో తిరిగి సోమవారం మధ్యాహ్నం ఇస్నాపూర్ నుంచి వెళ్తుండగా రుద్రారం సమీపంలోని సిగ్నోడ్ కంపెనీ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న సంతోష కిందపడగా, ఆమె తలపై నుంచి బస్సు టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆరూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్యామ్రావు(46) పది రోజుల క్రితం బతుకుదెరువు నిమిత్తం సదాశివపేట పట్టణానికి వచ్చాడు. ఉదయం ఆరూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీడీ పరిశ్రమను కాపాడండి

కేంద్ర మంత్రికి బీఎంఎస్ వినతి



కేంద్ర మంత్రితో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేటజోన్: గ్రామీణ కుటీర పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమను కాపాడాలని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు సోమవారం తెలంగాణ భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని జాతీయ బీఎంఎస్ కార్యదర్శి సురేంద్రన్, అఖిల భారత బీడీ మజ్దూర్ మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్‌లతో కలిసి ఆయన పలు సమస్యలపై వివరించారు. తెలంగాణలో 10 లక్షల మంది బీడీ కార్మికులున్నారని తెలిపారు. ప్రస్తుతం బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉందని, పెంచే ఆలోచన విరమించి 5 శాతానికి కుదించాలని కోరారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రి దామోదర ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి దామోదర

నర్సాపూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నర్సాపూర్ మీదుగా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామానికి వెళ్తుండగా స్థానిక ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ లతో పాటు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పలువురు నాయకులతో పట్టణ శివారులో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను గమనించాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరైనా నివసిస్తుంటే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. చెరువులు కుంటలను పరిశీలించాలని, పేదల ఇండ్లు కూలిపోతే నివేదిక ఇవ్వాలని సూచించారు.

జాతీయ క్రీడలకు విద్యార్థులు ఎంపిక

అభినందించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): కొండపాక హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యా పత్యా జాతీయ క్రీడలకు ఎంపికయ్యారని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే జాతీయ క్రీడలకు ఎస్ శరణ్య, ఎం.శ్రీరామ్, సీహెచ్ సాత్విక తెలంగాణ జట్టులో ఎంపికయ్యారు. దీంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగాల్లో విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతుల ప్రశాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైమ్ : హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు శిక్ష పడింది. సంగారెడ్డి పట్టణ పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన సంజయ్ లక్ష్మణ్ కంబ్లె వృత్తిరీత్యా కూలి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో 2020 జూన్ 7వ తేదీన తోటి అల్లుడు ఉత్తమ రామ యాడ్కెను కొత్త బస్టాండ్ సమీపంలో గల ప్రింటర్ ప్రెస్ ఎదుట బండరాయితో తలపై కొట్టి చంపాడు. అప్పటి ఇన్‌స్పెక్టర్ రమేశ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో నిందితున్ని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలు విన్న జిల్లా న్యాయమూర్తి భవాని చంద్ర నిందితునికి జీవిత ఖైదుతోపాటు రూ. 3వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. ఎస్‌హెచ్‌ఓ, ఇన్వెస్టిగేషన్ అధికారి వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పి.రమేశ్ తదితరులను జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ అభినందించారు.

మందుబాబులకు జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 21 మందికి మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున , మరో ఇద్దరికి రూ. 1500, మరో వ్యక్తికి రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ. 2500 జరిమాన విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గంజాయిని విక్రస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎస్ఐ కృష్ణారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి రోడ్డులో కాళేశ్వరం కాల్వ సమీపంలో బైక్‌పై వెళుతుండగా తనిఖీ చేయగా 700 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీస్ సిబ్బంది జనార్దన్, శశికాంత్, ఖాజా, లింగం, రవి, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారం..

నిందితునికి 20 ఏళ్ల జైలు, జరిమానా

దుబ్బాకరూరల్: బాలికపై అత్యాచారం చేసిన నిందితునికి పోక్సో కేసులో కోర్టు కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధించింది. సిద్దిపేట సీపీ అనురాధ వివరాల ప్రకారం... అక్బర్‌పేట – భూంపల్లి మండలానికి చెందిన పర్స శ్రీనివాస్(48) 2022, ఫిబ్రవరి 16న రాత్రి 10.30గంటలకు బహిర్భూమికి వెళ్లిన బాలిక నోట్లో చున్నీ కుక్కి లైంగికదాడి చేశాడు. బాలిక కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి దుబ్బాక సీఐ ఎం.కృష్ణ కేసు పరిశోధన చేసి నేరస్తుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోమవారం సిద్దిపేటలోని ఫస్ట్‌క్లాస్ అదనపు డిస్ట్రిక్ట్ కోర్టు, సెషన్స్ జడ్జి శ్రీజయప్రసాద్ వాదనలు విన్న తర్వాత నేరం రుజువైనందున నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. ఎస్ఐ హరీష్, సీఐ శ్రీనివాస్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సిబ్బందిని సీపీ అభినందించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను జిల్లా టాస్క్ ఫోర్స్(డీటీఎఫ్), సంగారెడ్డి టీం సభ్యులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద డీటీఎఫ్ బృందం సభ్యులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రావెల్ బస్సులో తీసుకొస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన 74 మద్యం బాటిళ్ల(42 లీటర్లు)ను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లను జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సీఐ వీణారెడ్డి, ఎస్ఐలు హనుమంతు, రమేశ్, మురళి, రాజ, ఉమారాణి ఉన్నారు.



డీటీఎఫ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు